ప్రజాశక్తి
శనివారం 13 సెప్టెంబర్ 2025 5
శ్రీ సత్యసాయి



రాష్ట్రస్థాయి నృత్య పోటీలకు శ్రీశేఖర్ అకాడమీ విద్యార్థిని

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. బుక్కపట్నంలోని (డైట్) జిల్లా విద్యా శిక్షణా సంస్థలో జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ (2025-26) లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన ముగ్గురిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అందులో హిందూపురం పట్టణానికి చెందిన శ్రీ శేఖర్ అకాడమికి చెందిన పదో తరగతి విద్యార్థిని కే.అంజన ప్రియ తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయింది. అకాడమీకి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల శ్రీ శేఖర్ అకాడమి కరెస్పాండెంట్ చంద్రశేఖర్, విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



ప్రతిభా విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

మోసం చేయడంలో 'సూపర్ హిట్'

సిపిఎం జిల్లా కార్యదర్శి సి. రామకృష్ణ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

15 నెలల్లో రాష్ట్ర ప్రజలను మోసం చేయడంలో కూటమి ప్రభుత్వం సూపర్ హిట్ అయిందని సిపిఎం జిల్లా కార్యదర్శి సి రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ నిర్వహించిన విజయోత్సవ సభలో కూటమి ప్రభుత్వం పచ్చి అబద్ధాలను మాట్లాడిందన్నారు. తన మాటలకు చప్పట్లు కొట్టాలంటూ ప్రజలను పదేపదే వేడుకున్న సీఎం గా చంద్రబాబు నాయుడు చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు అంటూ ఇచ్చిన హామీలో దేనిని అమలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు నిండిన వారికి నెలకు 15వందల రూపాయలు ఇస్తామన్నారని,50 ఏళ్ల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు పింఛను అన్నారని గుర్తు చేశారు. వీటిలో ఎంతమందికి ఎంత ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. వీటిని అమలు చేసే ప్రయత్నం ప్రభుత్వం చేయడం లేదని ప్రజలకు తెలుసన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తాం ప్రధాని మోదీ తో మాట్లాడి హామీని పొందుతాం అని ఈ సభా సాక్షిగా చంద్రబాబు ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈఎస్. వెంకటేష్, పట్టణ కార్యదర్శి బ్యాళ్ళ అంజి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ఎపిరైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి కదిరి టౌన్

కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు పూనుకున్నాయని అందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగుకు అనుకూలమైన 56వేల ఎకరాలు కార్పొరేటుకు కట్టబెడుతున్నాయని ఎపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన 'కార్పొరేట్ కబంధహస్తాల్లో వ్యవసాయరంగం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి అనుకూలమైన భూములను కార్పొరేటుకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా సోలార్ ప్రాజెక్టుల కోసమని రైతులకు ఏడాదికి నామమాత్రపు కౌలు చెల్లించి తీసుకుంటున్నాయన్నారు. అనంతరం రైతులకు చెందిన భూములను తాకట్టు పెట్టి రుణాలు పొందుతాయని ఆరోపించారు. తద్వారా భూములపై రైతులు హక్కు కోల్పోతారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ సంఘటితమై వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ప్రధాన కార్యదర్శి హరి, కదిరి మండల రైతు సంఘం కార్యదర్శి సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో నాయకులు

జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధుల అభిమానం మరువలేను..

కలెక్టర్ టిఎస్. చేతన్


కలెక్టర్‌కు చిత్రపటం అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల ప్రేమానురాగాలను, సహకారాన్ని మరువలేనివని బదిలీ కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో ఉద్యానవన పంటలు, పరిశ్రమల ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఇది అందరి సహకారంతో సాధ్యమైందన్నారు.

అభివృద్ధికి బాసటగా నిలిచారు : ఎమ్మెల్యే, మాజీ మంత్రి

జిల్లా అభివృద్ధికి కలెక్టర్ అందించిన సహకారం మరువలేమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. తాను కలెక్టర్ పనితీరు వల్ల పలు అంశాలు నేర్చుకున్నామన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, కలెక్టర్ జిల్లాకు అందించిన సేవలు మరువలేనివి అన్నారు. త్వరలో జరిగే సత్యసాయి జయంతి వేడుకల వరకు ఇక్కడే ఉంటే బాగుండేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. పలువురు రెవెన్యూ ఉద్యోగులు మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈసందర్భగా వారు సత్యసాయి చిత్రపటాన్ని కలెక్టర్ కు బహుకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్. వర్మ, ఆనంద్ కుమార్, మహేష్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ సూర్యనారాయణ రెడ్డి, రెవిన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మైముద్దీన్, తహశీల్దార్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర తాగునీటి పథకం పనులు వేగవంతం చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ముస్సిపాలిటీలో సమగ్ర తాగునీటి పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు, కమిషనర్ క్రాంతికుమార్‌కు సూచిం చారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి మున్సిపల్ సమగ్ర తాగునీటి పథకం అభివృద్ధి పనులపై ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమగ్ర తాగునీటి పథకానికి ముస్సిపాలిటీకి రాష్ట్ర పురపాలక శాఖ నుంచి రూ. 136 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామ న్నారు. పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్నప్పుడే ఈ పథకాన్ని తీసుకొ చ్చానని, గత వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. సమావేశంలో జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ డీఈ నరసింహమూర్తి, అధికారులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సింధూర

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

పుట్టపర్తి రూరల్ : ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పేద కుటుంబాలకు అందజేశారు. మొత్తం 24 మందికి రూ. 24,12,816 విలువ చేసే చెక్కులు అందజేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకూ నియోజక వర్గంలో మొత్తం 112 మందికి సుమారు రూ. 1.28 కోట్లు అందజేశా మన్నారు. వివిధ జబ్బులతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సిఎం చంద్రబాబు ఆర్థిక భరోసా కల్పిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో బాధిత కుటుంబాలతో పాటు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బాబు, నాయకులు పాల్గొన్నారు.

మండల మీట్‌లో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం ఎంపిడిఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎంపిపి వెంకట రత్నమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలు ఏకరువు పెట్టారు. సభ్యురాలు వసుంధర మాట్లాడుతూ కల్లూరు గ్రామ జడ్పీ హైస్కూల్‌లో సైన్స్ టీచర్‌ను నియమించా లని కోరగా స్పందించిన ఎంఇఒ మాట్లాడుతూ ప్రస్తుతం ఓ టీచర్ వారంలో మూడు రోజులు తరగతులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమిస్తామని తెలిపారు. పులమతి, కోడిపల్లి పంచాయతీల సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో యూరియా కొరత ఎక్కువగా ఉందని, రైతులకు అరకొరగా కాకుండా పూర్తిస్థాయిలో యూరియా, ఎరువులు సరఫరా చేయాలని కోరారు. స్పందించిన వ్యవసాయ శాఖ అధికారి యూరియా విడతల వారీగా సరఫరా చేస్తున్నారు. వచ్చిన వెంటనే రైతులందరికీ పంపిణీ చేస్తామన్నారు. రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమాధానం ఇచ్చారు. గతంలో పంచాయతీల్లో చేసిన పనులకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న నిధులను ఏఏ పనులకు కేటాయిం చారో పూర్తి వివరాలు తెలపాలని ఎంపిటిసి సభ్యులు కోరారు. ప్రభుత్వం దసరాకు రూ. 15వేల చొప్పున పంపిణీ చేస్తుందని, అర్హులైన ఆటో, క్యాబ్ డ్రైవర్లు సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపిపిలు అఅంజనరెడ్డి, విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు, డాక్టర్ రాజుకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ దివ్య, ఇరిగేషన్ ఏఈ నాగరత్నమ్మ, హౌసింగ్ ఏఈ నరేష్, పంచాయతీ కార్యదర్శులు సాయి, దుర్గయ్య, ప్రజాప్రతినిధులు మంజునాథ్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

సమస్యల పరిష్కారం కోసమే 'పల్లెబాట'

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న ఉద్దేశంతో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని బాలంపల్లి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ హెచ్.ఎన్. రాము ఆధ్వర్యంలో పల్లె బాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే అర్జీ ద్వారా సంబంధిత అధికారులకు సమర్పిస్తే ఆ సమస్యను పది రోజుల్లో సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సరస్వతి, డిప్యూటీ ఎంపిడిఒ శివ కుమార్‌తో పాటు మండల స్థాయి అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-తాడిమర్రి

పొగాకు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా శుక్రవారం విద్యార్థులు స్థానిక పాఠశాల నుంచి బస్టాండ్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు కృష్ణమోహన్, వెంకటేష్, హెచ్‌ఎం విద్యార్థులతో కలిసి పాఠశాలల సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. 1991-92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాల విద్యార్థుల కోసం హెచ్‌ఎం అరుణకు క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పిడిలు అమరాంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు కుళ్లాయిరెడ్డి, నాగరాజు, కాటమయ్య, రామ్మోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, భగవంత్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

పరిగి బస్టాండ్‌లో మరుగుదొడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో పరిగి బస్టాండ్ లో బిఒటి కింద కాంట్రాక్టర్ అయూబ్ సొంత నిధులతో నిర్మించిన పే అండ్ యూజ్ టాయిలెట్స్ (మరుగుదొడ్లు)ను మున్సిపల్ చైర్మేన్ డిఈ రమేష్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వందలాది మంది వస్తుంటారనివారందరు మరుగు దొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారని అన్నారు.. వీరితో పాటు పరిగి బస్టాండ్, మార్కెట్ వ్యాపారులు ఎంతో మంది ఉదయం ఇంటి నుంచి వచ్చి వ్యాపారాలను చేసుకొంటు సాయంత్రం వరకు ఇక్కేడే ఉంటారన్నారు. వారు మధ్యలో కాలకృత్యాలు తీర్చుకోవాలంటే ఇబ్బంది పడేవారన్నారు. బస్టాండ్‌లో మరుగు దొడ్లు ఏర్పాటు చేయడంతో ఆయా వర్గాలకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సతీష్ కుమార్, రాఘవేంద్ర, ఇర్షాద్ అహమ్మద్, టీడీపీ నాయకులు సుమో సీనా, దుర్గా నవీన్, డైమండ్ బాబా, అన్వర్, కాంట్రాక్టర్లు అయూబ్, తౌసిఫ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్లు తదితరులు

దళిత రణభేరి కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గం బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం దళిత రణభేరి కరపత్రాలను ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. రాష్ట్రంలో దళితులపై దాడులను నిరసిస్తూ ఈ నెల 24న దళితుల రణభేరి కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు బందెల గౌతం కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, బిఎస్పీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట నాగరాజు కరపత్రాలను విడుదల చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు పెన్నయ్య, దాసరి ఈశ్వరయ్య, సుబ్బరాయప్ప, నరసింహప్ప, వెంకటేష్, నారాయణప్ప, రామప్ప, రామాంజనప్ప, ఆదినారాయణ, తిప్పయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'కళాఉత్సవ్'



బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారి రాజేంద్రకుమార్

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో శుక్రవారం జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. రెండు రోజులు నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 396 మంది విద్యార్థులు 6 విభాగాల్లో ప్రతిభ, నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముఖ్యఅతిథి బిసి వెల్ఫేర్ అధికారి రాజేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉమ్మడి జిల్లా స్థాయి ప్రతిష్టను పెంచాలని కోరారు. గాత్ర సంగీతం- ఎం.దీపిక(9వ తరగతి, అనంతపూర్ నవభారత్ స్కూల్), హర్షిని గ్రూప్ బాలికల ఉన్నత పాఠశాల ధర్మవరం, వాద్య సంగీతం- వేదవ్యాస్(9వ తరగతి, రొద్దం జడ్పీహెచ్‌ఎస్), హర్షిత(ఐకాన్ జూనియర్ కళాశాల, హిందూపురం), నృత్యంలో మైథిలి గ్రూప్ (దాడితోట, జడ్పీహెచ్‌ఎస్), నాటకం గజాల గ్రూప్-కేజీబీవీ ఆత్మకూరు, దృశ్యకళలు- కారుణ్య జడ్పీ హెచ్‌ఎస్ బుక్కపట్నం, కిరణ్మయి లేపాక్షి, వరుణ్ సందేశ్ జడ్పీహెచ్‌ఎస్ గోరంట్ల, సంప్రదాయ కథ, కథనం షణ్ముఖ గ్రూప్ జడ్పీహెచ్‌ఎస్, రేకులకుంట, వీరు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు డైట్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైట్ కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఎన్నికల సమయంలో బిసిలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు పర్చాలని రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నామాల శంకర్ ఆధ్వర్యంలో బిసి నాయకులు కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ టిఎస్ చేతన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బిసి కుల జనగణన చేసి జనాభా దామాషా, నిష్పత్తి ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కుమ్మరి వెంకటరమణ, నాయకులు గిర్రాజు రవి, వెంకటేష్, గోగుల రవి, సామకోటి ఆదినారాయణ, శంకర, చంద్రశేఖర్, పల్లా నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎపి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రామాపురం జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల జూనియర్ బాల, బాలికల 10వ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. ముందుగా వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ చేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ పోటీలో గెలుపొందడానికి ప్రతిఒక్కరూ వందశాతం ప్రయత్నం చేయాలన్నారు. గెలిస్తే పొంగిపోవద్దు.. ఓడితే కుంగిపోవద్దని సూచించారు. ఓటమిలో చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పిఇటి లక్ష్మీనారాయణ, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, ధర్మవరం మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ అయ్యప్ప, చెన్నకేశవ, సోమశేఖర్, బోయపాటి అప్పస్వామి, తదితరులు పాల్గొన్నారు.


బాల్ బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో పరిటాల శ్రీరామ్

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం న్యాయవాదులు పుట్టపర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులకు ఉచిత ఆరోగ్య బీమా కార్డులు ఇవ్వాలని, బార్ కౌన్సిల్ నేతృ త్వంలో అడ్వకేట్ వెల్ఫేర్ డెత్ బెనిఫిట్‌ను రూ.10 లక్షలకు పెంచాలని, మృతి చెందిన న్యాయవాదుల కుటుంబాలకు మ్యాచింగ్ గ్రాంట్ రూ. 4లక్షలు వెంటనే చెల్లించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించేంత వరకూ వివిధ రూపాలోల నిరసన కొనసాగి స్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు లెక్కల యధుభూషణ, కృష్ణప్రసాద్, నాగేంద్ర, రాజ్‌గోపాల్, కె.హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో లాటరీ విక్రేతలు.?

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో లాటరీ విక్రయించే వారిని పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వివరాలు.. అన్నమయ్య జిల్లా మదనపల్లి, రాయచోటి ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు లాటరీ టికెట్లు తీసుకొచ్చి పట్టణంలోని మార్కెట్ సమీపంలోని కొలిమి, మసానంపేట, నిజాంవలి కాలనీ, చౌక్ సర్కిల్, తదితర ప్రాంతాల్లో దినసరి కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని విక్రయాలు సాగిస్తున్నట్లు తెలిసింది. దీంతో సుమారు పది మంది లాటరీ విక్రేతలను పట్టణ పోలీసులు మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకొని గుట్టుగా విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సోషలిజ సమాజ స్వాప్నికుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి

సిపిఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లావ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజళి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో కొనసాగుతున్న మతోన్మాదం నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే ఏచూరికి నిజమైన నివాళి అని పునరుద్ఘాటించారు. సీతారాం ఏచూరి సోషలిజ సమాజ స్థాపనతోనే అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని నమ్మిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.


పుట్టపర్తిలో సీతారాంఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలు కొనసాగిద్దాం

వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ప్రముఖులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పేద, మధ్యతరగతి ప్రజల కోసం జీవితం అంకితం చేసిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. పట్టణంలోని న్యూఅమీన్‌నగర్‌లో పేదల గుడిసెల వద్ద శుక్రవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి అధ్యక్షతన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకర్‌రెడ్డి గుడిసెల్లోని పేదలతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి రెండు దఫాలు రాజ్యసభ సభ్యుడిగా పని చేశారన్నారు. పేదల జీవన ప్రమాణాల్లో మార్పు కోసం, అసమానతలు, దోపిడీదారు వ్యవస్థకు వ్యతిరే కంగా ఎనలేని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. దేశంలో మంత్రులు, ఎంపిల ఆదాయం పెరిగిందే కానీ పేదల రాబడి పెరగలేదన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా పేదల జీవన ప్రమా ణాల్లో మార్పు రాలేదన్నారు. పేదలు 2 సెంట్ల ఇంటి స్థలం కోసం గుడిసెలు వేసుకుని రెండేళ్లుగా పోరాడుతున్నా గత వైసిపి ప్రభుత్వం కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం కానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోగా, విదేశాల నుంచి పత్తి తక్కువ ధరకు దిగుమతి చేసుకునేలా చట్టం చేసి ఇక్కడి రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన యువతకు ఉద్యోగాలు లేకుండా చేస్తున్నా, భారత ఉత్పత్తులపై సుంకాలు విధిస్తున్నా ప్రధాని మోడీ ట్రంప్‌ను ఒక్కమాట మాట్లాడిన పాపాన పోలేదన్నారు. ప్రజలు, రైతులు, కార్మికులు, అన్ని వర్గాల వారికి న్యాయం జరగాలంటే సిపిఎంతోనే సాధ్యమన్నారు. బిజెపి అనుబంధ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ప్రజల మధ్య చీలిక తీసుకొస్తోందని, అలాంటి వాటిని ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జంగాలపల్లి పెద్దన్న, హరి, సాంబశివ, రామ్మోహన్, శాంతభాయ్, శివన్న, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు ఏచూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బ్యాళ్ళ అంజి, వి కే ఎస్ జిల్లా అధ్యక్షులు సాకే వెంకటేష్, జిల్లా ఆటో రంగం కన్వీనర్ పెడ బల్లి బాబా, భవన నిర్మాణ కార్మికుల రంగం, జిల్లా కోశాధికారి అంకె ముత్యాలు, మహిళ నాయకురాలు, శ్రావణి, బువ్వమ్మ, తిరుపాలు, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం గ్రామ సిపిఎం కాలనీలో కమిటీ నాయకురాలు అంజలి అధ్యక్షతన కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య పేదలతో కలిసి ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హనుమయ్య మాట్లాడుతూ ఏచూరి రాజ్యసభలో పేద మధ్యతరగతి ప్రజలు, రైతుల గొంతుకగా మారి వారి సమస్యలపై గళం విప్పారన్నారు. ఏచూరి స్ఫూర్తితో స్థానిక కాలనీలో ఇళ్ల స్థలాల హక్కుల సాధన కోసం కలిసికట్టుగా ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మీసాల ఆంజనేయులు, అశ్వర్థమ్మ, వెంకటలక్ష్మమ్మ, రామాంజనమ్మ, లోకేష్, ప్రదీప్, కాలనీవాసులు, పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : మండలంలోని మామిళ్లకుంట క్రాస్ దళిత కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే వెంకటేష్, సభ్యులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేష్ మాట్లాడుతూ 1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ)లో సభ్యుడిగా ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆ మరుసటి ఏడాదే భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) సభ్యునిగా చేరారన్నారు. అత్యవసర పరిస్థితికి కొంతకాలం ముందు అజ్ఞాతంలోకి వెళ్లారన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితి ఎత్తివేసిన తర్వాత జెఎన్‌యు విద్యార్థి నాయకునిగా మూడు సార్లు ఎన్నికయ్యారన్నారు. 1978లో అఖిల భారత ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షునిగా పని చేశారన్నారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ నాయకురాలు కురుబ రమాదేవి, గౌరమ్మ, భాగ్యమ్మ, అనిత, మనమ్మ, తిరుపాలమ్మ, నవ్యశ్రీ, సుకన్య పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : ఒడిసిలో సిపిఎం సీనియర్ నాయకులు వివి.రమణ, మండల కన్వీనర్ కుళ్లాయప్ప ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఏచూరి జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఎంఎ ఎకనామిక్స్ పూర్తి చేశారన్నారు. అక్కడే పిహెచ్‌డి చేస్తుండగా ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యారన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షునిగా ఎన్నికైన తొలి వ్యక్తిగా ఏచూరి ఘనత సాధించారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సురేష్, తిరుపాల్ అంజి పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలో ఏర్పాటు చేసిన సీతారాం ఏచూరి వర్ధంతి సభలో ఆ పార్టీ నాయకులు ఎస్‌హెచ్.బాషా, జెవి. రమణ, టి.అయూబ్‌ఖాన్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్.ఆదినారాయణ, ఎస్.హైదర్‌వలి, వి. వెంకటస్వామి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అమన్, శ్రీనాథ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.


కదిరిలో ఏచూరి వర్ధంతి సభలోమాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి


గోరంట్లలో ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



ధర్మవరం, కొత్తచెరువలో ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

యుటిఎఫ్ 'రణభేరి'ని జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 తేదీ వరకూ నిర్వహించే రణభేరిని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, నరేష్‌కుమార్ రణభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రణభేరి ఈ నెల 17వ తేదీ పెనుకొండలో ప్రారంభమై గోరంట్ల మీదుగా సాగి సాయంత్రం కదిరిలో ముగుస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్ వేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఆర్థిక, ఆర్థికేతర ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని, పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెనుకొండ, రొద్దం శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేంద్రమూర్తి, రవీంద్రనాథ్, గంగాధర్, మారుతి, నాయకులు ఎంకె.నబి, జి.రమేష్, టి.రమేష్, రామాంజనేయులు, గోవిందప్ప, వెంకటేష్, ఆది, శ్రీనివాస్‌రావు, చిన్న వెంకటేషులు, కాశీ, గోపి, నరేష్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక ఎమ్మార్సీ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణబేరి గోడపత్రికలను ఆవిష్కరిం చారు. యుటిఎఫ్ నాయకులు హెచ్ఎం టి.ప్రసాద్, పామిడి ముంతాజ్‌అలీ, మల్లికార్జున, రమణ నాయక్, ఖాదర్‌బాషాలు, రామసుబ్బయ్య, సాయిరామ్, రమేష్, రమణారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


పెనుకొండలో రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గర్భిణులు, బాలింతలు, పిల్లలు సమతుల ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఒ జయంతి తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కొత్తూరు అంగ న్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో 'పౌష్టికాహార మాసోత్సవాలు' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఒ మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, పండ్లు, అన్నీ తీసుకుంటేనే సమతులాహారం అవుతుందన్నారు. పిండి పదార్థాలు, ఖనిజ లవణాలు, విటమిన్లు అన్నీ సమపాళ్లలో తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంత మైన బిడ్డకు జన్మనిస్తారని, బిడ్డలకు పాలు పుష్టికరంగా ఇవ్వవచ్చన్నారు. కాల్షియం అందాలంటే పిల్లల కు పాలు బాగా తాగించాలని తెలిపారు. ఆడపిల్లను బతకనిద్దాం, చదవనిద్దాం అన్నారు. బాల్య వివా హాలు, ఆడపిల్ల చదువు, మంచి స్పర్శ-చెడు స్పర్శ, పిల్లలపై అఘాత్యాలు, తదితర అంశాల గురించి తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్స్ 1098, 104, 181, 112 గురించి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి లత, ఐసిడిఎస్ స్టాఫ్ వనజాక్షి, మహిళా సంరక్షణ కార్యదర్శి బేబీరాణి, అంగన్వాడీ కార్యకర్తలు నాగ మణి, శంకరావతి, వేద, శ్రావణి, యశోద, అనంతమ్మ, సౌభాగ్య, కుర్షిత్‌బి, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని చింతా రామచంద్రారెడ్డి ఇంటి నుంచి ట్రెండ్స్ వరకూ రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టిన 600 మీటర్ల డ్రెయినేజీ నిర్మాణానికి శుక్రవారం టిడిపి నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నాయకులు సోమశేఖర్, చింతా రామచంద్రారెడ్డి, నరేష్, నిమ్మల శ్రీధర్, అజమతుల్లా, వేణు, జయరాం, వెంకటరమణ, సింగిల్‌విండో అధ్యక్షులు చంద్ర, రమణ, విద్యాధరణి పాల్గొన్నారు.


డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేస్తున్న టిడిపి నాయకులు

ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రతి కుటుంబం ఆర్థిక అక్షరాస్యతను తప్పనిసరిగా అభివృద్ధి చేసుకోవాలని కదిరి సహకార బ్యాంకు మేనేజర్ మహాలక్ష్మీ సూచించారు. స్థానిక మండల సహకార బ్యాంకు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రైతుల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడానికి ఆర్థిక అక్షరాస్యత ఎంతో అవసరమన్నారు. ప్రతి కుటుంబం కొంతవరకూ పొదుపు అలవాటు చేసుకోవాలని, ప్రణాళికాబద్ధంగా ఆర్థిక వ్యవహారాలు నడిపించుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, తదితర పథకాల ద్వారా రైతులకు రూ. 4 లక్షల వరకూ లబ్ధి పొందే అవకాశం ఉందని వివరించారు.


'ఉపాధి' కూలీలకు పనులు కల్పించాలి

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని ఎపిఒ చంద్రశేఖర్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం 'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎపిఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 79 ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకానికి మొక్కలు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే రైతుల పొలాల్లో గుంతల పనులు చేపట్టి దాదాపు 40 ఎకరాల్లో మొక్కల పెంపకం పనులు పూర్తి చేశామని, మిగిలిన 39 ఎకరాల్లో పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఈసీ ఆనంద్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు అంజనప్ప, నల్లప్ప, రవిచంద్రారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు హేమంత్‌రెడ్డి, పరిమళ, నాగేష్, జయరామ్ పాల్గొన్నారు.

పాత్రికేయుని కుటుంబానికి ఆర్థిక సాయం

సోమందేపల్లి : స్థానిక వినాయక్ నగర్‌లో నివాసం ఉంటున్న చేనేత కుటుంబానికి చెందిన పాత్రికేయుడు సురేష్ అనారోగ్యంతో 15 రోజులుగా బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసియులో చికిత్స పొందుతున్నాడు. మంత్రి సవిత ఆదేశాల మేరకు టిడిపి నాయకులు నీరుగంటి చంద్ర, టౌన్ కన్వీనర్ వడ్డే సురేష్, కిష్టప్ప శుక్రవారం సురేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు రూ. 25వేలు, నీరుగంటి చంద్ర రూ. 5వేలు అందజేశారు. వారు మాట్లాడుతూ సురేష్ కుటుంబానికి మంత్రి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, తూముకుంట వెంకటరాముడు, బాబయ్య, డీలర్లు తూముకుంట బాలు, జక్కా చంద్ర, నాయకులు మద్దిలేటి, మోహన్, అంజి, శివప్ప, ఎల్ఐసి మహమ్మద్, గుర్రం శీన ఉన్నారు.


సురేష్ కుటుంబ సభ్యులను నగదు అందజేస్తున్న నాయకులు

టిడిపి నేతకు శ్రీరామ్ పరామర్శ

ప్రజాశక్తి-తాడిమర్రి

'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురైన మండలంలోని పెద్దకోట్ల గ్రామానికి చెందిన మోపిరెడ్డిని శుక్రవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆర్‌డిటి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అలాగే వైద్య ఖర్చులకు రూ. 20 వేలు అందజేశారు. శ్రీరామ్ వెంట మండల కన్వీనర్ రాము, క్రిష్ణ, వీర ఉన్నారు.

లారీని ఢీకొన్న బొలెరో.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని మండ్లిపల్లి సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు.. మొలకలచెరువు వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం కదిరి వైపు నుంచి వస్తున్న లారీని మండ్లిపల్లి సమీపంలో వేగంగా ఢీ కొనడంతో బొలెరో డ్రైవర్ ముదిగుబ్బ మండలంలోని దొరిగల్లుకు చెందిన ప్రతాప్(28) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకని మృత దేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను తొలగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..

పరిగి : మండలంలోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో కొడిగెనహళ్లికి చెందిన నాగభూషణం మృతి చెందారు. వివరాలు.. నాగభూషణం, లక్ష్మీనారాయణ బైక్‌పై పరిగి వెళ్లి పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళ్తుండగా సిరికల్చర్ ఆఫీస్ ముందు ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నాగభూషణం తీవ్రంగా గాయపడగా లక్ష్మీనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో నాగభూషణంను 108 ద్వారా హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

కొత్తచెరువు : స్థానిక బుక్కపట్నం రోడ్డులోని శివాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తచెరువు నుంచి బుక్కపట్నం వెళుతున్న కారు డ్రైవర్ ఉన్నఫళంగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై వెళ్తున్న బుచ్చయ్యగారిపల్లి గ్రామానికి చెందిన బాబు, చరణ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మారుతి శంకర్ తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

కదిరి టౌన్ : పట్టణంలోని శివాలయం వీధికి చెందిన ఓ యువతి కనిపించడంలేదని కుటుంబ సభ్యుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. యువతి తండ్రి రవి నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదన్నారు. దీంతో చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదన్నారు. కదిరి రూరల్ మండలంలోని దిగువపల్లి గ్రామానికి చెందిన మహేష్ నాయుడుపై అనుమానం ఉందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

బాల్య వివాహం నేరం

ప్రజాశక్తి-కదిరి టౌన్

బాల్య వివాహం చట్టరీత్యా నేరమని సమత స్వచ్ఛంధ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు తెలిపారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ సహకారంతో సమత స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అక్బరియా మసీదులో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇస్లాం మత పెద్దలు బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. సమత స్వచ్ఛంధ సంస్థ ప్రెసిడెంట్ ఆదినారాయణరెడ్డి, జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ సహకారంతో ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ శ్రీసత్య సాయి, అన్నమయ్య జిల్లాల్లో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, అత్యాచారాల నివారణకు కృషి చేస్తున్నామన్నారు.

నల్లమాడ : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో బాల, బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసిడిఎస్ అధికారిణి సత్యవతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పద్మావతి, నాగేశ్వరమ్మ, గాయత్రి, గంగాదేవి, రమణమ్మ, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.


నల్లమాడలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారిణి సత్యవతి

ఆదర్శ ఉపాధ్యాయుడు 'జాబిలి'కి సన్మానం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని కోగిర జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడు, కవి, రచయిత, సామాజిక సేవా కార్యకర్త జాబిలి చాంద్‌బాషా ఈ నెల 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. దీంతో శుక్రవారం హైస్కూల్‌లో హెచ్ఎం హరికిరణ్ అధ్యక్షతన ఆత్మీయ సన్మానసభ నిర్వహించి జాబిలి చాంద్‌బాషా దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంఇఒలు అరవింద్, విజయభాస్కర్, హెచ్ఎం హరికిరణ్ అవార్డ గ్రహీత చాంద్‌బాషా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు శివరామ్, క్లస్టర్ హెచ్ఎం వన్నప్ప, సర్పంచి రామకృష్ణ, టిడిపి నాయకులు ఆంజనేయులు, ఎస్ఎంసి ఛైర్మన్ వసికేరప్ప, పాల్గొన్నారు.


జాబిలి చాంద్‌బాషా దంపతులను సన్మానిస్తున్న ఎంఇఒలు, హెచ్ఎం, ఉపాధ్యాయులు

సత్యసాయి కళాశాలలో ఫ్రెషర్స్ డే

పెనుకొండ టౌన్ : పట్టణంలోని శ్రీసత్య సాయి జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ పిఎన్ గంగాధర్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. సీనియర్లు జూనియర్ విద్యార్థులకు ఘనంగా స్వాగం పలికారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ నూతన విద్యార్థులు కళాశాల జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో బాగా చదివి తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో కళాశాల ఏవో కేశవయ్య, అధ్యాపకులు బాబు, మంజునాథ్, మల్లికార్జున, చెన్నకేశవ, రవినాయక్, రమ్యకళ, సంధ్య, శ్రావణి, వరలక్ష్మి పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కెవిపిఎస్ మహిళా కమిటీ ఎన్నిక

పెనుకొండ టౌన్ : కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.హనుమయ్య, ప్రధాన కార్యదర్శి ఎంవి.రమణ ఆధ్వర్యంలో కెవిపి ఎస్ మండల మహిళా కమిటీని ఎన్నుకున్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షురాలుగా సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా కె.జ్యోతమ్మ, 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలని, మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. వీటి పై పెద్దఎత్తున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మమ్మ, లక్ష్మీదేవమ్మ, రత్నమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పుట్టపర్తి క్రైమ్ : సత్యసాయి బాబా శత జయంతి పురస్కరించుకుని చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ క్రాంతి కుమార్ తెలిపారు. పట్టణంలోని డిఆర్‌డిఎ కార్యాలయం వెనుక భాగంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం జిల్లా డిపిఎం అనురాధ, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ శిబిరాన్ని ఈ నెల 18వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. తొలి రోజు 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నియోజకవర్గ వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

తనకల్లు : నియోజకవర్గ వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలిగా తనను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయనిశుక్రవారం కనుమల విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం కల్పించిన పార్టీ సమన్వయకర్త బిఎస్.మక్బూల్ అహమ్మద్, మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. కాగా విజయలక్ష్మి వైసిపి ఆవిర్భావం నుంచి మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.



వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నితిన్



మడకశిర రూరల్ : వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నితిన్‌ను నియమించినట్లు శుక్రవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. నితిన్‌కు పలువురు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కేతిరెడ్డికాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో శుక్రవారం టూ టౌన్ సిఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అలాగే కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనుమానితులు సంచరిస్తుంటే డయల్-100కు సమాచారం ఇవ్వాలన్నారు. కొత్త వ్యక్తులు ఇళ్లలో అద్దెకు దిగే సమయంలో వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. అందరూ చట్టపరంగా జీవించాలని తెలిపారు. చెడు వ్యసనాలకు లోనైతే కుటుంబం నాశనం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టూ టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నేత మృతికి సంతాపం

మడకశిర రూరల్ : వైసిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతికి ఆ పార్టీ నాయకులు రంగేగౌడ్, రాష్ట్ర కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, ఆనంద రంగారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-రొద్దం

రొద్దం, తురకలాపట్నం గ్రామాలోల 33 కెవి విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌మూర్తి తెలపారు. కావున తురకలాపట్నం, రొద్దం, దొడఘట్ట, పెద్దమంతూరు, రాగిమేకలపల్లి విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు రేకులకుంట విద్యార్థులు

ప్రజాశక్తి-మడకశిర టౌన్

బుక్కపట్నంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యార్థులకు నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో మండలంలోని రేకులకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుర్రకథలో విద్యార్థినులు శాన్విక, చందన, మానస ప్రతిభ కనబరిచారని హెచ్ఎం గిరిజ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అరుంధతి, వేదాచలం, దేవరాజు, సరస్వతి, రజియా బేగం, సిబ్బంది అభినందించారు.




రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులు శాన్విక, చందన, మానస లను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అంగన్వాడీల సంబరాలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడం పట్ల శుక్రవారం టిడిపి నాయకులు తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అంగన్వాడీ సిబ్బంది మాట్లాడుతూ ఈ నిర్ణయం మా జీవితాలను మార్చే స్థాయిలో ఉందని, ఇకపై మరింత చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు. అలాగే అంగన్వాడీ నాయకురాలు రజియా ఆధ్వర్యంలో అన్ని మినీ అంగన్వాడీ వర్కర్స్ విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మినీ అంగన్వాడీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్ల ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమానికి నాయకురాళ్లు శ్రీదేవి, ఉషారాణి, పద్మావతి, రత్న, తదితరులు పాల్గొన్నారు.


ముదిగుబ్బలో కేక్ కట్ చేస్తున్న అంగన్వాడీలు

సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న జ్వరాలపై పుట్టపర్తి పిహెచ్‌సి డాక్టర్ జి.మునిచంద్రిక ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది మండలంలో సర్వే నిర్వహించారు. ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది శుక్రవారం రాచువారిపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సీజనల్, అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించాల న్నారు. నీటి తొట్టెల్లో దోమల లార్వాల నిర్మూలనకు అబేట్ ద్రావణం పిచికారి చేయించారు. కార్యక్రమా న్ని సిహెచ్ఒ కె.శివరాం, సూపర్‌వైజర్ వెంకటరమణ పర్యవేక్షిం చారు. కార్యక్రమంలో ఎఎన్ఎం కెబి.సుగుణమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : వాతావరణంలోని మార్పుల వల్ల వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధుల పట్ల అవగా హనతో జాగ్రత్త వహించాలని వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ సూచించారు. మండలంలోని తిప్పేపల్లి, తండా పరిసర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జ్వర అనుమానిత వ్యక్తులకు రక్త పరీక్ష చేశారు. వ్యాధిగ్రస్తులకు మందుల అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి రామచంద్రారెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి దేవలానాయక్, సిహెచ్ఒ ప్రమీల, ఆరోగ్య పర్యవేక్షకులు రామకృష్ణమ్మ, ఎమ్మెల్‌హెచ్‌పి హేమలత, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


పుట్టపర్తి : రాచువారిపల్లి లో నీటితొట్టెను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది